https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 185 బుధవారం 17-9-2025 పేజీలు : 4 వెల : 2 రూ/..

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.
సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# సర్కారీ పథకాలకు డిస్కమ్!

## వ్యవసాయ పంపుసెట్లు, ఎత్తిపోతలన్నీ దాని పరిధిలోకే..

**రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తర్వాత ఏర్పాటు!**

**కొత్త డిస్కమ్‌పై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి**

**రెండున్నరేళ్లలో కోర్ అర్బన్ రీజియన్‌లో**

**భూగర్భ విద్యుత్తు తీగల ఏర్పాటు పూర్తి కావాలి**

**కర్ణాటక తదితర రాష్ట్రాల్లో అధ్యయనం చేయండి**

**డిసెంబరులోగా పూర్తిస్థాయి ప్రణాళికలు**

**సౌర విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహించండి**

**అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం**



**హైదరాబాద్, సెప్టెంబరు 16:** రాష్ట్రంలో సర్కారీ పథకాల కరెంటు కనెక్షన్ల కోసం కొత్తగా విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్) ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. తెలంగాణలో ప్రస్తుతం దక్షిణ ప్రాంతం కోసం హైదరాబాద్ కేంద్రంగా ఎస్పీడీసీఎల్, ఉత్తర ప్రాంతం కోసం హనుమకొండ కేంద్రంగా ఎన్పీడీసీఎల్ ఉన్నాయి. ఇవిగాక కొత్తగా ఒక డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కొద్ది రోజుల కిందట ఇంధన శాఖను ఆదేశించిన సంగతి తెలిసిందే. 28 లక్షల వ్యవసాయ పంపుసెట్లు, ఎత్తిపోతల పథకాలు, గ్రామీణ తాగునీటి సరఫరా, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ వంటి పథకాల విద్యుత్తు కనెక్షన్ల కోసం కొత్తగా డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని సర్కారు యోచిస్తోంది. ఈ క్రమంలో కొత్త డిస్కమ్ ప్రతిపాదనను అధికారులు సిద్ధం చేశారు. మంగళవారం దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రస్తు తం ఉన్న 2డిస్కమ్‌లను 3డిస్కమ్‌లుగా పునర్వ్యవస్థీకరించాలని సీఎం అధికారులకు సూచించారు. మూడో డిస్కమ్ కోసం విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు(పీపీఏ)లు, ఆస్తులవిభజన, బకాయిలు, ఇతర అంశాలపై కీలక సూచనలు చేశారు. కొత్త డిస్కమ్ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం లభించిన అనంతరం ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈలోగా కొత్త డిస్కమ్ ప్రతిపాదనకు తుదిరూపు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

**జీహెచ్ఎంసీలో భూగర్భ విద్యుత్తు వైర్లు..**

గ్రేటర్ హైదరాబాద్‌లో భూగర్భ విద్యుత్తు తీగల ఏర్పాటుకు సిద్ధం చేసిన ప్రతిపాదనలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారీ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తొలుత కోర్ అర్బన్ రీజియన్‌లో భూగర్భ తీగలతో పాటు సబ్‌స్టేషన్లను ఉన్నతీకరించాలని, ఓవర్‌లోడ్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. సబ్‌స్టేషన్ సామర్థ్యాని కంటే ఒక్క కనెక్షన్ కూడా ఎక్కువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే కోర్ అర్బన్ రీజియన్‌లో కొత్తగా సబ్‌స్టేషన్లు ఎక్కడెక్కడ అవసరం ఉందనేది గుర్తించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లోని సబ్‌స్టేషన్లలో అధునాతన సాంకేతికతను ఉపయోగించాలని సూచించారు. విద్యుత్తు తీగలతో పాటు ఇతర కేబుళ్లకు కూడా అండర్ గ్రౌండ్ కేబులింగ్ వ్యవస్థను ఉపయోగించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలన్నారు. బెంగళూరుతో పాటు ఇతర రాష్ట్రాల్లోని అండర్ గ్రౌండ్ కేబులింగ్ ప్రాజెక్టులను అధ్యయనం చేయాలని చెప్పారు. డిసెంబరులోగా అండర్ గ్రౌండ్ కేబులింగ్‌కు సంబంధించిన పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందించాలని, రాబోయే రెండున్నరేళ్లలో కోర్ అర్బన్ రీజియన్‌లో అండర్ గ్రౌండ్ కేబులింగ్‌ను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

**సౌర విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహించండి**

రాష్ట్రంలో సౌర విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహించాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. కొండారెడ్డిపల్లిలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన సోలార్ రూఫ్‌టాప్ విలేజ్ పనుల వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. ఇందిర సౌర గిరి జల వికాసం ద్వారా రైతులకు సౌర పంపుసెట్లు అందించాలని, వాటికి కంటెయినర్ బేస్డ్ సౌర ఫలకాల ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు.

## అవినీతి నిరుద్యోగ నిర్మూలనే తమ ప్రభుత్వ అజెండా

**నేపాల్, సెప్టెంబర్ 16 :**



నేపాల్‌లో తీవ్ర ఆర్థిక సంక్షోభం, ప్రభుత్వ నిర్ణయాలపై అసంతృప్తితో నేపాల్‌లో యువత చేపట్టిన ఆందోళనలు ఫలించాయి. 'జెన్ జీ' తరం ఆధ్వర్యంలో జరిగిన హింసాత్మక నిరసనల ధాటికి పాత ప్రభుత్వం కుప్పకూలగా, దేశంలో కొత్త రాజకీయ శకం మొదల్కొంది. దేశ మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి (73) తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టి తన మంత్రివర్గాన్ని ప్రకటించారు. దేశాన్ని తిరిగి గాడిన పెట్టడం, యువత ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ఈ తాత్కాలిక ప్రభుత్వం పనిచేయనుంది. ప్రధాని సుశీల కర్కి తన మంత్రివర్గంలో ముగ్గురు కీలక వ్యక్తులకు స్థానం కల్పించారు. సమాజంలో మంచి పేరున్న, తమ రంగాల్లో నిపుణుల్కైన వారిని ఎంపిక చేసుకోవడం గమనార్హం.ఓమ్ ప్రకాశ్ అర్యాల్ అవినీతికి వ్యతిరేకంగా పోరాడే ప్రముఖ న్యాయవాదిగా పేరున్న ఈయనకు హెూం, న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల వంటి కీలక శాఖలను అప్పగించారు.కుల్మన్ ఘిసింగ్ నేపాల్ విద్యుత్ అథారిటీ మాజీఅధిపతిగా, దేశంలో ఏళ్ల తరబడి ఉన్న విద్యుత్ కోతలకు చరమగీతం పాడిన వ్యక్తిగా ప్రజల మన్ననలు పొందారు. ఇప్పుడు ఆయనకు ఇంధనం, మౌలిక సదుపాయాలు, రవాణా, పట్టణాభివృద్ధి శాఖల బాధ్యతలు ఇచ్చారు.ఈ నియామకంపై దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది.రమేశ్వర్ ఖానల్ప్రముఖ ఆర్థికవేత్త, మాజీ ఆర్థిక కార్యదర్శి అయిన ఈయనకు ఆర్థిక శాఖను కేటాయించారు. దేశంలో 25 శాతం మేర ఉన్న యువ నిరుద్యోగితను పరిష్కరించే గురుతర బాధ్యతను ఆయనపై ఉంచారు.తాజాగా జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని సుశీల కర్కి మాట్లాడుతూ, తాను ఈ పదవిని కోరుకోలేదని, ప్రజల ఆకాంక్షల మేరకే బాధ్యతలు స్వీకరించానని స్పష్టం చేశారు. "నా పేరు సమాజం నుంచి తెరపైకి వచ్చింది... ఈ ప్రభుత్వం 'జన్ జీ' తరం ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తుంది" అని ఆమె హామీ ఇచ్చారు. అవినీతిని అంతం చేయడం, ఆర్థిక సమానత్వాన్ని సాధించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆమె పేర్కొన్నారు. ఇటీవలి ఆందోళనల్లో ధ్వంసమైన అధ్యక్ష భవనం సమీపంలోనే ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగడం దేశంలోని ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతోంది.సెప్టెంబర్ 8న ప్రభుత్వం సోషల్ మీడియాపై నిషేధం విధించడం, పెరుగుతున్న ఆర్థిక ఇబ్బందులతో యువతలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

## నెతన్యాహూ జాగ్రత్త, ఖతార్ మా మిత్రదేశం: ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబర్ 16**



గత వారం గాజాలో కాల్పుల విరమణ కోసం అమెరికా చేసిన ప్రతిపాదనలపై చర్చిం చేందుకు దోహాలో సమావేశం అయిన హమాస్ నేతలపై సమ్మిట్ ఆఫ్ ఫైర్ పేరుతో ఇజ్రాయెల్ విరుచుకుపడ్డ విషయం అందరకీ తెలిసిందే.అయితే ఈ దాడుల్లో ఖతార్ భద్రతా అధికారి సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. తాజాగా దీనిపై అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. తమ దేశానికి కీలక మిత్రదేశంగా ఉన్న ఖతార్ పట్ల చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా ఈ దాడులు లక్ష్యాలను ఛేదించడంలో విఫలం అయ్యాయని.. కానీ ఆరుగురి ప్రాణాలను మాత్రం తీశాయంటూ వ్యాఖ్యానించారు. మోరిస్టౌన్ విమానాశ్రయంలో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ సమయంలోనే ఆయనకు మీడియా ప్రతినిధులు ఓ ప్రశ్న అడిగారు. ముఖ్యంగా ఈ దాడుల గురించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఏమైనా చెప్పాలనుకుంటున్నారా అని ప్రశ్నించారు. దీనికి ట్రంప్ సమాధానం చెబుతూ.. వారు చాలా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. హమాస్ విషయంలో ఏద్కైనా చర్య తీసుకోవాల్సి ఉంటుందని, కానీ ఖతార్ అమెరికాకు గొప్ప మిత్ర దేశం అని పేర్కొన్నారు. ఈ విషయం చాలా మందికి తెలియదని చెప్పారు. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడానికి కొన్ని రోజుల ముందు ఆయన న్యూయార్క్‌లో ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ బిన్ జస్సిమ్ అల్ థానీతో విందులో పాల్గొన్నారు. అప్పుడే ఖతార్ ప్రధానిని గొప్ప వ్యక్తిగా అభివర్ణించిన ట్రంప్.. ఆయనకు దేశ ప్రతిష్టను మెరుగుపరచుకోవాలని సలహా ఇచ్చానట్లు చెప్పారు. ప్రజలు ఖతార్ గురించి చాలా చెడుగా మాట్లాడుతున్నారని.. కానీ అలా ఉండకూడదని పేర్కొన్నారు. న్యూయార్క్‌లో సెప్టెంబర్ 11 దాడుల జ్ఞాపకార్థం జరిగిన ఈ విందులో మధ్య ప్రాచ్య ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ కూడా పాల్గొన్నారు. విందు తరువాత ఖతార్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ హమాష్ష అల్-ముఫ్తా ఎక్స్ వేదికగా.. అధ్యక్షుడితో గొప్ప విందు అని అన్నారు. అదిప్పుడే ముగిసిందని చెప్పుకొచ్చారు.

## రేవంత్ రెడ్డి వల్ల హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది : కేటీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :** కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా రేవంత్ రెడ్డి సృష్టించిన భయం కారణంగా



హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. గత 22 నెలలుగా కాంగ్రెస్ పార్టీ అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ విజయయాత్రను తిరిగి ప్రారంభించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికపై బీఆర్ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించింది. కేటీఆర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పార్టీ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఘన విజయం సాధిస్తుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గత 22 నెలలుగా కాంగ్రెస్ పార్టీ అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ఆయన తెలిపారు. హైదరాబాద్‌ను తెలంగాణ ఆర్థిక ఇంజిన్‌గా మార్చిన గత పదేళ్ల తమ ప్రభుత్వ పాలనకు భిన్నంగా, కాంగ్రెస్ పార్టీ విధానాలు నగరాన్ని పూర్తిగా కుప్పకూల్చేలా ఉన్నాయని, ఈ విషయాన్ని నగర ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కొనసాగాలంటే భారత రాష్ట్ర సమితి మళ్లీ అధికారంలోకి రావాల్సిందేనని ప్రజలు భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా రేవంత్ రెడ్డి సృష్టించిన భయం కారణంగా హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని, అన్ని రంగాలపై కాంగ్రెస్ అసమర్థ విధానాల ప్రతికూల ప్రభావం తీవ్రంగా ఉందని కేటీఆర్ గుర్తు చేశారు.



# ఎలాన్ మస్క్‌పై ఎల్లిసన్ ఆధిపత్యం..



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :**
ప్రపంచ కుబేరుడిగా అర్ధ దశాబ్దంపాటు కొనసాగాడు ఎలాన్ మస్క్. అయితే మస్క్ ఆధిపత్యానికి చెక్ పడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో విభేదాలు వచ్చిన కొన్ని రోజులకే మస్క్ నంబర్ వన్ స్థానం కోల్పోయాడు. ఇప్పుడు ప్రపంచ కుబేరుడిగా ట్రంప్ ఫ్రెండ్ ఒరాకిల్ సంస్థ అధినేత ఎల్లిసన్ నిలవడం చర్చనీయాంశంగా మారింది.ఒరాకిల్ కంపెనీ ఇటీవల విడుదల చేసిన ఆదాయ నివేదిక ఆర్థిక మార్కెట్‌లో సంచలనం సృష్టించింది. కృత్రిమ మేధస్సు (ఏఐ) కస్టమర్ల నుంచి డేటా సెంటర్ సామర్థ్యానికి భారీ డిమాండ్‌తో ఒరాకిల్ షేర్లు ఒక్క రోజులో 40% పెరిగాయి. ఈ ఆర్థిక విజయం ల్యారీ ఎల్లిసన్ సంపదను 101 బిలియన్ డాలర్లకు పెంచి, 393 బిలియన్ డాలర్లకు చేర్చింది. దీంతో ఎలాన్ మస్క్‌ను (385 బిలియన్ డాలర్లను) అధిగమించి, బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్‌లో అగ్రస్థానానికి చేరాడు.ఒరాకిల్ సీఈవో సఫ్రా కాట్జ్ ప్రకారం, కంపెనీ ఈ త్రైమాసికంలో నాలుగు బిలియన్ డాలర్ల కాంట్రాక్ట్‌లపై సంతకం చేసింది. రాబోయే నెలల్లో మరిన్ని భారీ ఒప్పందాలు ఖాయమని ఆమె తెలిపారు. ఏఐ సాంకేతికతకు సంబంధించిన డేటా సెంటర్ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను ఒరాకిల్ సమర్థవంతంగా అందిపుచ్చుకోవడం ఈ విజయానికి ప్రధాన కారణం. ఈ వ్యూహం కంపెనీ మార్కెట్ విలువను గణనీయంగా పెంచింది, ఎల్లిసన్ సంపదను కొత్త శిఖరాలకు చేర్చింది.81 ఏళ్ల ల్యారీ ఎల్లిసన్ 1977లో ఒరాకిల్‌ను స్థాపించాడు. 2014 వరకు సీఈవోగా సేవలందించారు. ప్రస్తుతం ఛైర్మన్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా కొనసాగుతున్న ఆయన, కంపెనీ సాంకేతిక ఆవిష్కరణలకు మార్గదర్శకుడిగా ఉన్నారు. ఎల్లిసన్ వ్యాపార దూరదృష్టి, ఏఐ, క్లౌడ్ సాంకేతికతలపై దృష్టి సారించడం వల్ల ఒరాకిల్ ప్రపంచ టెక్ దిగ్గజంగా ఎదిగింది. ఆయన వ్యక్తిగత సంబంధాలు, ముఖ్యంగా ట్రంప్‌తో సన్నిహిత సంబంధాలు, ఒరాకిల్‌కు వ్యాపార అవకాశాలను మరింత విస్తరించాయని విశ్లేషకులు భావిస్తున్నారు.ఎలాన్ మస్క్ గతంలో ప్రపంచ కుబేరుడిగా ఆధిపత్యం చెలాయించినప్పటికీ, ఒరాకిల్ షేర్ల ఊపందిస్తూ ఎల్లిసన్ అతన్ని అధిగమించారు. టెస్లా, స్పేస్‌ఎక్స్ వంటి కంపెనీలతో మస్క్ సంపద గణనీయంగా ఉన్నప్పటికీ, ఒరాకిల్ ఇటీవలి ఆర్థిక విజయం ఎల్లిసన్‌ను ముందంజలో నిలిపింది. ఈ ఆర్థిక మైలురాయి టెక్ పరిశ్రమలో ఏఐకు పెరుగుతున్న ప్రాముఖ్యతను, అలాగే ఒరాకిల్ యొక్క వ్యూహాత్మక విజయాన్ని సూచిస్తుంది.

# ఫేమస్ ఫంక్షన్ హాల్ సీజ్.

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :**
ప్రభుత్వ స్థలంలో నిర్మించిన చాలా వరకు నిర్మాణాలు హైడ్రా వచ్చిన తర్వాత ఒక్కోటి బయటకు వస్తున్నాయి. కొంత మంది అక్రమ కట్టాలు విషయంలో ఫిర్యాదు చేసేందుకు హైడ్రా దాక వెల్లకుండా.. ఆ పరిధి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. అక్కడ నిజంగానే అక్రమ కట్టడం జరిగిందా లేదా అనేది అధికారులు నిర్ధారించుకొని వాటిని కూల్చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో ఏ నిర్మాణాలు చేపట్టవద్దని ప్రభుత్వం చెబుతున్నా.. చాలా మంది పెడచెవిన పెడుతున్నారు.

ఈ కోవలోకే వస్తుంది ఈ ఘటన. హైదరాబాద్ లో ఫేమస్ ఫంక్షన్ హాల్ ను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ భూములపై అక్రమ కట్టడాలు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు చర్యలు వేగవంతం చేస్తున్నారు. తాజాగా హిమాయత్‌నగర్‌లో హైదరగూడ అపోలో ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఈఎఫ్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఈ స్థలం ప్రభుత్వానికి చెందిందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో.. పోలీసులు భద్రత కల్పించగా అధికారుల బృందం స్వాధీనం చేసుకుందిఈ వ్యవహారం చాలా కాలంగా న్యాయపరమైన వివాదంలో ఉంది. ఫంక్షన్ హాల్ యజమా నులు ప్రభుత్వ భూమిలో వ్యాపారం నడుపుతున్నారని గతంలో కేసు నమోదైంది. చివరికి సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ఈ చర్య సపట్టారు. ఈ సందర్భంగా మజ్లీస్ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం కూడా చోటుచేసుకుంది.హైడ్రా ఏర్పడిన తర్వాత నగరంలో అనేక అక్రమ నిర్మాణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటివరకు ప్రజలు అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు చేసేందుకు నేరుగా హైడ్రాకు వెళ్లకపోయినా.. పరిధి రెవెన్యూ అధికారులకు సమాచారం అందిస్తే అక్కడి పరిశీలన తర్వాత నిర్మాణం చట్టబద్ధమా కాదా అనేది నిర్ధారిస్తున్నారు. అక్రమంగా తేలితే వాటిని కూల్చివేయడం లేదా స్వాధీనం చేసుకోవడం జరుగుతోంది.ప్రభుత్వం తరచూ ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తోంది. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి కట్టడాలు, వ్యాపారాలు, ఫంక్షన్ హాళ్లు లేదా వాణిజ్య ప్రాజెక్టులు చేయకూడదని స్పష్టం చేస్తోంది. అయినప్పటికీ కొంతమంది పెద్దల మద్దతుతో అక్రమంగా భూములను ఆక్రమించి వాణిజ్య కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఈఎఫ్ గార్డెన్ ఘటన కూడా అదే తరహా లో వెలుగులోకి వచ్చింది.నగరంలో అనేక ప్రాంతాల్లో ఇలాంటి కేసులు బయటపడుతున్నాయి. శివార్లలో గాని, వాణిజ్య కేంద్రాల్లో గాని అక్రమ కట్టడాలు గుర్తించిన వెంటనే హైడ్రా బృందాలు అక్కడికి చేరుకొని చర్యలు తీసుకుంటున్నాయి. ప్రజలు కూడా ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. అధికారుల కఠిన చర్యలు కొనసాగితే భవిష్యత్తులో నగరంలో అక్రమ నిర్మాణాల పెరుగుదల తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# కొత్త కార్డుల కష్టాలు...

## ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు

**వరంగల్, సెప్టెంబర్ 16 :**
తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిన ప్రభుత్వం.. కొత్త వారికి కూడా సెప్టెంబర్ కోటా రేషన్ విడుదల చేసింది. అయితే వీరిలో చాలా మందికి డీలర్లు రేషన్ ఇవ్వడం లేదు. కారణం ఈకేవైసీ పూర్తి చేయకపోవడం. కొందరు ఈకేవైసీ పూర్తి చేసినా.. ఆధార్ అప్‌డేట్ లేకపోవడంతో వారి రేషన్ కార్డు ఈకేవైసీ రావడం లేదు. దీంతో వారంతా ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసింది. జూన్ నెలలోనే మూడు నెలల రేషన్ పంపిణీ చేసిన ప్రభుత్వం సెప్టెంబర్ 1 నుంచి తిరిగి రేషన్ పంపిణీ ప్రారంభించింది. కొత్తగా రేషన్ కార్డు పొందిన వారికి కూడా సెప్టెంబర్ నుంచి రేషన్ పంపిణీ చేస్తున్నారు. అయితే కొత్తగా కార్డు పొందిన వారితో పాటుగా.. పాత రేషన్‌కార్డు హోల్డర్లకు ఆధార్ కార్డుకు సంబంధించిన ఓ ఇష్యూ వల్ల సమస్య ఎదుర్కొంటున్నారు. దీంతో డీలర్లు వారికి బియ్యం ఇవ్వడం లేదు. ఇంతకు సమస్య ఏంటి అంటే..రేషన్‌కార్డు దారులు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత రెండేళ్ల నుంచి చెబుతూనే ఉన్నాయి. పైగా ఈకేవైసీ అప్‌డేట్ కోసం గడువు పెంచుతూపోతున్నాయి. అయినా సరే ఇంకా కొందరు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయలేదు. అలానే తాజాగా మంజూరు చేసిన కొత్త రేషన్‌కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చారు. వీరికి కూడా సెప్టెంబర్ నెలకు సంబంధించిన రేషన్ కోటా విడుదల చేశారు. అయితే వీరంతా బియ్యం పొందాలంటే కచ్చితంగా ఈకేవైసీ చేయించాల్సిందే అంటున్నారు డీలర్లు. చాలా వరకు జిల్లాల్లో సుమారు 80 శాతం మందికి ఈకేవైసీ పూర్తి కాగా.. మరో 20 శాతం మంది మాత్రం ఇంకా పూర్తి చేయలేదు. దీంతో వారికి రేషన్ బంద్ చేస్తామని డీలర్లు చెబుతున్నారు.అయితే వీరిలో కొందరు ఈకేవైసీ చేయించుకున్నప్పటికీ.. వీరి వేలి ముద్రలు అప్‌డేట్ కావడం లేదు. దీని గురించి ఆరా తీయగా.. సదరు వ్యక్తుల ఆధార్ కార్డు అప్‌డేట్ కాలేదని.. అందుకే వారి ఈకేవైసీ ప్రక్రియ పూర్తి కాలేదని తెలిసింది.

చిన్నారులకు ఆధార్ కార్డు అప్‌డేట్ చేయకపోవడం వల్ల వారు ఈకేవైసీకి దూరం అయ్యి.. రేషన్ బియ్యం పొందలేని పరిస్థితి నెలకొంది. దీంతో వీరంతా ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు.అయితే పలు జిల్లాల్లో ఆధార్ కేంద్రాలు తక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని మండలాల్లో ఆధార్ కేంద్రాలు లేవు. దీంతో వీరు ఇతర మండలాలకు వెళ్తున్నారు. దీంతో పలు ఆధార్ కేంద్రాల వద్ద జనాలు పెద్ద సంఖ్యలో క్యూ కడుతున్నారు. అధికారులు మరిన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది అంటున్నారు. దీనిపై అధికారులు స్పందిస్తూ ఆలస్యం అయినా పర్లేదు కానీ.. ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేయించుకుంటే మంచిది అంటున్నారు. ఆధార్‌కు ఈ-పాస్ యంత్రాన్ని అనుసంధానం చేయడంతో.. తప్పుడు వ్యక్తులు బియ్యం తీసుకోవడానికి వీలుండదు. అందుకే కేవైసీ నిబంధన తప్పనిసరి చేశారు.

# టీడీపీపైనే బీజేపీ భారం...

**హైదరాబాద్, సెప్టెంబర్ 16**
తెలంగాణలో( తెలుగుదేశం పార్టీ మరోసారి క్రియాశీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. తెలుగుదేశం పార్టీ ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రభావవంతమైన పార్టీగా ఎదిగింది. సుదీర్ఘకాలం అధికారంలో ఉంది. ప్రతిపక్ష పాత్ర కూడా పోషించింది. రాష్ట్ర విభజన తర్వాత మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణలో ఉనికి కోల్పోయింది. అయినా సరే అక్కడ క్యాడర్ కొనసాగుతోంది. ప్రధానంగా సెటిలర్స్ ఉన్న గ్రేటర్ హైదరాబాద్, ఖమ్మం వంటి జిల్లాల్లో ఇప్పటికీ టిడిపి జెండాలు కనిపిస్తూనే ఉన్నాయి. అయితే ఇప్పుడు మరోసారి గ్రేటర్లో తెలుగుదేశం పార్టీ క్రియాశీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ముఖ్యంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఆసక్తికరంగా మారుతోంది. ఇక్కడి ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఈ స్థానానికి ఎన్నిక అనివార్యంగా మారింది. ఈ ఏడాది చివర్లో ఎన్నిక జరిగే అవకాశం ఉంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల తో పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ప్రకటన రావచ్చు అని అంచనా వేస్తున్నారు. దీంతో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కు తున్నాయి. ప్రధాన పార్టీలు పోటీకి సిద్ధపడుతున్నాయి. కానీ అందరి చూపు తెలుగుదేశం పార్టీ పైనే ఉంది.2014లో మాగంటి గోపీనాథ్ తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే తెలంగాణలో మారిన రాజకీయ ముఖచిత్రంతో ఆయన కెసిఆర్ వెంట అడుగులు వేస్తారు. జూబ్లీహిల్స్ అనేది సెటిలర్స్ ఎక్కువగా ఉండే ప్రాంతం. అయితే మొన్నటి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయలేదు. అప్పట్లో ఏపీలో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు అరెస్ట్ అయ్యారు. ఆ సమయంలో ఎన్నికలు రావడంతో టిడిపి బరిలో దిగలేదు. అయితే ఇప్పుడు కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో టిడిపి పోటీ చేసే ఛాన్స్ లేదు. అందుకే ఆ పార్టీ మద్దతు కూడగట్టేందుకు అటు బిఆర్ఎస్, ఇటు బిజెపి ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.ఎమ్మెల్యే గోపీనాథ్ అనారోగ్యంతో మృతి చెందడంతో.. వచ్చిన ఉప ఎన్నికను ఏకగ్రీవం చేయాలని బిఆర్ఎస్( భావిస్తోంది. కానీ కాంగ్రెస్ పార్టీ ఒప్పుకునే పరిస్థితిలో లేదు. ఇక్కడ బీసీ నేత నవీన్ యాదవ్ కు ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉంది. నవీన్ యాదవ్ తండ్రి శ్రీశైలం యాదవ్ కు టిడిపి తో మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకే టిడిపి ఓటర్లు నవీన్ యాదవ్ పై మొగ్గు చూపుతారని రేవంత్ అంచనా వేస్తున్నారు. మరోవైపు టిఆర్ఎస్ అభ్యర్థిగా దివంగత మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులను బరిలో దించేందుకు కేసిఆర్ నిర్ణయించారు. 2014లో మాగంటి గోపీనాథ్ టిడిపి ద్వారా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఈ నియోజకవర్గంలో కమ్మ సామాజిక వర్గంతో పాటు సెటిలర్స్ అధికంగా ఉన్నారు. వీరంతా టిడిపి సానుభూతిపరులే. మాగంటి కుటుంబం ఇప్పటికీ చంద్రబాబు కుటుంబంతో సన్నిహితంగా మెలుగుతూ వచ్చింది. అందుకే గోపీనాథ్ మృతి చెందినప్పుడు మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులు పరామర్శకు వచ్చారు. మొన్న ఆ మధ్య జూబ్లీహిల్స్ కు సంబంధించి మాట్లాడేందుకు కేటీఆర్ నారా లోకేష్ ను కలిసినట్టు కామెంట్స్ వినిపించాయి.

# వానలు, వరదలతో అన్నదాత ఘోష

**అదిలాబాద్, సెప్టెంబర్ 16**
నిర్మల్ జిల్లాలో గత నెల 27 నుంచి కురిసిన వర్షాలు అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. వాన కాలంలో సాగుచేసిన పంటలకు భారీ వర్షాల వల్ల వాగులు గొర్రెలు చెరువు లు నదులు ఉప్పొంగి ప్రవహించడంతో వరదదాటికి పంటలు నీట మునగడమే కాకుండా కొట్టుకపోయాయి. నిర్మల్ జిల్లాలో 79 వ్యవసాయ కష్టాల పరిధిలో వర్షాలు వరదల వల్ల20, 000 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారులు వంచన వేస్తున్నారు.జిల్లాలోని కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు స్వర్ణ వాగు ప్రాజెక్ట్ గడ్డన్న శుద్ధ వాగు తో పాటు గోదావరి పరివాహక ప్రాంతమైన బాసర లోకేశ్వరం దిల్వార్పూర్ సొన్ లక్ష్మణ చందా ఖానాపూర్ కడెం దస్తురాబాద్ మండలాల్లో పత్తి సోయా మొక్కజొన్న వరి పసుపు తదితర పంటలు మూడు రోజులపాటు నీటిలోనే ఉండడంవల్ల అధిక నీటితో కూలిపోయినట్టు రైతులు పేర్కొంటున్నారు. దీనికి తోడు సారంగాపూర్ నర్సాపూర్ కుబీర్ కుంటాల తదితర మండలాలు చెరువు అలుగులు వాగుల వల్ల వరదల్లో తీవ్ర నష్టం జరిగినట్టు రైతులు పేర్కొంటున్నారు. నిర్మల్ జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల రైతులు సాగు చేసుకున్నాం పంటలు నష్టపోవడంతో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటను సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించినట్టు తెలిపారు. జిల్లాలోని 79 వ్యవసాయ క్లస్టర్లలో ఏఈవోలు ఆయా కష్టాల పరిధిలో భారీ వర్షాలు వరదల వల్ల దెబ్బతిన్న వివిధ పంటలను సర్వే నెంబరు ఫోటో రైతు పేరు పంట నష్టం ఎకరాలు తదిత వివరాలను నమోదు చేసుకొని ఆన్లైన్ చేశారు.జిల్లాలో మొత్తం 12,804 రైతులు 19530 ఎకరాల్లో వివిధ పంటలు నష్టపోయినట్టు తెలిపారు. ఇందులో వరి పంట 59 82 ఎకరాలు పత్తి 38:40 సోయా 62 86 మొక్కజొన్న 18 85 పసుపు 10 62 ఆయిల్ సీడ్ పంట 326 ఎకరాలు నష్టపోగా మిగతాది పప్పు దినుసులు పంటలు కూరగాయ పంటలు నష్టపోయినట్లు అధికారులు సర్వే నిర్వహించారు.వాన కాలంలో పంటలు సాగు చేసుకునేందుకు దుక్కులు దునడాన్ని మొదలుకొని విత్తనాలు వేయడం కలుపు తీయడం ఎరువులు వేయడం కూలీల ఖర్చులు పిచికారి మందులతో ఎకరానికి 10,000 వరకు ఖర్చు వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే అధిక వర్షాలు ఆపై వరదలు పంటలను నీటిలో ముంచడంతో పంట పొలాల్లో నీరు నిలిచిపోవడం వల్ల కూలిపోయి పంట చేతికి వచ్చే అవకాశాలు లేదని ఆయా గ్రామాల రైతులు కన్నీటి పర్యవంతమవుతున్నారు.మరో నెలరోజులు కడితే పంటలు చేతికొచ్చి దశలో తాము పంట కోల్పోలువలసి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వ్యవసాయ పంట భూములు కోతలు ఏర్పడి ఇసుక మేటలు కూడా వేయడంతో వాటిని తొలగించాలంటే వేలాది రూపాయల ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం సర్వే చేసి పంట నష్టం వివరాలను జిల్లా వ్యవసాయ శాఖ ద్వారా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన పరిహారంపై ఇంకా స్పష్టత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారుఇటీవల కురిసిన భారీ వర్షాలు వరదల నేపథ్యంలో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటేనే మేలు జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. జిల్లాలో భారీ వర్షాలు వరదల వల్ల నష్టపోయిన పంటలను జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానిక ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి వేడుమ బుజ్జి పటేల్ రామారావు పటేల్ క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు జరిగిన నష్టం పై విచారం వ్యక్తం చేశారు.ప్రభుత్వం పరిహారాన్ని ఎకరానికి 25 వేలు చెల్లించాలని బిజెపి ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుండగా అధికార పార్టీ మంత్రి మాత్రం ప్రభుత్వం ఆదుకుంటుంది అని చెప్పారు తప్ప ఎకరానికి ఇంత డబ్బులు ఇస్తామని ఎక్కడ స్పష్టం చేయకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంటలు నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకునేలా నష్టపరిహారాన్ని ప్రకటించి రెండు పంట పెట్టుబడికి బ్యాంకు రుణాలు అందించాలని జిల్లా రైతులు కోరుతున్నారు


## రాజకీయాల్లోకి సీఎం సిద్దరామయ్య మనవడు..

**- వరుణ నుంచి బరిలోకి ధవన్..**

**- పట్టుబడుతున్నఅభిమానులు**

బెంగళూరు: రాజకీయాలలోకి వారసులు రావడం కొత్తేమి కాదు. అయితే వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా మాట్లాడే సీఎం సిద్దరామయ్య మరో వారసుడు రాజకీయాలలోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు చర్చలు జోరందుకున్నాయి. ఇప్పటికే సిద్దరామయ్య కుమారుడు డాక్టర్ యతీంద్ర వరుణ నుంచి ఓసారి ఎమ్మెల్యేగా కొనసాగి, ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. అయితే సీఎం మనవడు ధవన్ రాకేశ్‌ను రాజకీయాల్లోకి తీసుకొచ్చే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. సిద్దరామయ్య రాజకీయ వారసుడిగా పెద్ద కుమారుడు రాకేశ్‌ను రాజకీయాల్లోకి తీసుకురావాలని ప్రయత్నించారు. అయితే రాకేశ్ అకాలమరణం చెందిన విషయం తెలిసిందే. ఆ తర్వాతనే యతీంద్రను రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. సిద్దరామయ్య మరోసారి పోటీ చేసే ఆలోచనలో లేనట్లు తెలుస్తోంది. గత ఎన్నికల వేళ వరుణ నియోజకవర్గంలో ఇవే చివరి ఎన్నికలని ప్రకటించారు. నామినేషన్ సమయంలోనూ ధవన్ రాజకీయాల్లోకి వస్తారని ప్రస్తావించిన విషయం కూడా ఉంది. మారుతున్న రాజకీయాలలో రిటైర్డు అయ్యేది లేదని ఇటీవలే ప్రకటించారు.

# భారత్‌ను 'టారిఫ్‌ల మహారాజు'గా అభివర్ణించిన వైట్‌హౌస్ సలహాదారు..



**వాషింగ్టన్, సెప్టెంబర్ 16 :** భారత్-అమెరికా మధ్య కీలక వాణిజ్య చర్చలు జరగడానికి ఒక రోజు ముందు, వైట్‌హౌస్ ఉన్నతాధికారి నుంచి తీవ్రమైన వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఎట్టకేలకు భారత్ దారికొస్తోందని అని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో నోరుపారేసుకున్నారు. భారత్‌ను 'టారిఫ్‌ల మహారాజు' అని అభివర్ణించిన నవారో, వాణిజ్య చర్చల విషయంలో భారత్ తన వైఖరి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. నవారో ఇటీవల భారత్ పై తరచుగా దురుసు వ్యాఖ్యలు చేస్తున్నారు. 'రియల్ అమెరికాస్ వాయిస్' అనే షోలో మాట్లాడిన నవారో, "ప్రపంచంలోని ప్రధాన దేశాల్లో అమెరికాపై అత్యధిక సుంకాలు విధిస్తున్నది భారతే. ఈ విషయాన్ని మేం కచ్చితంగా పరిష్కరించుకోవాలి" అని అన్నారు. అంతేకాకుండా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత భారత్ చౌకగా రష్యా చమురు కొనుగోలు చేస్తూ లాభాలు గడిస్తోందని, దీనివల్ల అమెరికా పన్ను చెల్లింపుదారులు యుద్ధం కోసం మరింత డబ్బు పంపాల్సి వస్తోందని ఆయన ఆరోపించారు. మంగళవారం నాడు ఢిల్లీలో భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు జరగనున్నాయి. ఈ చర్చలను వేగవంతం చేసేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయని భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి, ముఖ్య సంధానకర్త రాజేష్ అగర్వాల్ ధృవీకరించారు. ఈ చర్చల కోసం దక్షిణాసియాలో అమెరికా వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ ఒక రోజు పర్యటనపై ఢిల్లీకి రానున్నారు. గత నెలలో రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు తగ్గించుకోవడానికి భారత్ నిరాకరించిందన్న కారణంతో, భారత ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలను 50 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. దీంతో ఆగస్టులో భారత ఎగుమతులు తొమ్మిది నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. అయితే, ఇటీవలే ప్రధాని మోదీని 'గొప్ప ప్రధాని' అని ట్రంప్ ప్రశంసించడం, దానికి మోదీ సానుకూలంగా స్పందించడం వంటి పరిణామాలు ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడే అవకాశం ఉందని సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జరగబోయే వాణిజ్య చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# 140 కోట్ల మంది ఉన్నారు

## గంపెడు మొక్కజొన్న పొత్తులైనా కొనరు



**వాషింగ్టన్, సెప్టెంబర్ 16 :**
అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ మరోసారి భారత్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అమెరికా నుంచి మొక్కజొన్నను దిగుమతి చేసుకోవడానికి భారత్ చూపిన విముఖత అలాగే విధించిన అధిక సుంకాలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. భారత్ తన సుంకాలను తగ్గించుకోకపోతే.. అమెరికాతో ఆరోగ్యకరమైన వాణిజ్య సంబంధాలను కొనసాగించడం కష్టం అవుతుందని లుట్నిక్ హెచ్చరించారు. భారత దేశంలో 140 కోట్ల మంది ప్రజలు ఉన్నారని లుట్నిక్ తెలిపారు. మరి వారు అమెరికా నుంచి కనీసం ఒక్క గంపెడు మొక్కజొన్నన్నైనా ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. భారత్ మనకు ప్రతిదీ అమ్ముతోందని.. కానీ మన మొక్కజొన్నను కొనడానికి మాత్రం వారు నిరాకరిస్తారని తెలిపారు. అంతేకాకుండా భారత్ ప్రతి దానిపై సుంకాలు విధిస్తోందని లుట్నిక్ పేర్కొన్నారు. ఇది కేవలం వారు మాత్రమే లాభం పొందే వాణిజ్య సంబంధం అని ఆయన అభివర్ణించారు. అమెరికా మార్కెట్‌కు భారత్ సులభంగా ప్రవేశాన్ని పొందుతున్నప్పటికీ.. అమెరికన్ వస్తువులపై మాత్రం ఆంక్షలు విధిస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలను పునరుద్ఘాటిస్తూ.. 'న్యాయమైన, పరస్పర వాణిజ్యం' ఉండాలని లుట్నిక్ అన్నారు. "మీ సుంకాలను తగ్గించుకోండి, మీరు మాతో ఎలా ప్రవర్తిస్తున్నారో అలాగే మేము కూడా మీతో ప్రవర్తిస్తాం" అని ఆయన భారత్‌కు పరోక్షంగా సూచించారు. లుట్నిక్ ప్రకారం.. భారత్ వస్తువులపై సుంకాలు విధించడం ద్వారా గతంలో జరిగిన అన్యాయాలను సరిచేయాలని అమెరికా కోరుకుంటోంది. ట్రంప్ ప్రభుత్వం భారతీయ వస్తువులపై 50 శాతం వరకు సుంకాలు విధించింది. అంతేకాకుండా రష్యా నుంచి భారత్ కొనుగోలు చేస్తున్న చమురుపై 25 శాతం పన్నును కూడా విధించింది. ఇది అన్ని దేశాలపై విధించిన దానికంటే చాలా ఎక్కువ కాగా దీని గురించి లుట్నిక్ స్పందించారు. ఇది మా అధ్యక్షుడి నమూనా, మీరు దీన్ని అంగీకరించాలి లేకపోతే ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారు అయిన అమెరికాతో వ్యాపారం చేయడం మీకు కష్టం అవుతుందని లుట్నిక్ స్పష్టం చేశారు.

# అక్రమ వలసదారులపై ట్రంప్ కీలక నిర్ణయాలు



అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం డల్లాస్‌లో భారత సంతతికి చెందిన చంద్ర నాగమల్లయ్య దారుణ హత్యకు గురైన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ అమానుష ఘటనపై అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. నిందితుడిపై 'ఫస్ట్ డిగ్రీ మర్డర్' నేరం కింద పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు. అలాగే తన పాలనలో అమెరికాను మళ్లీ సురక్షితంగా మారుస్తానని, అక్రమ వలసదారులు, నేరస్థుల పట్ల ఇక ఏ మాత్రం మెతక వైఖరి ఉండబోదని స్పష్టం చేశారు. ట్రంప్ తన ట్రూత్ సోషలవేదికపై ఈ ఘటన గురించి ప్రస్తావిస్తూ.. టెక్సాస్‌లోని డల్లాస్‌లో బాగా పేరున్న వ్యక్తి చంద్ర నాగమల్లయ్య దారుణ హత్య గురించి నేను తెలుసుకున్నానన్నారు. ఒక క్యూబన్ అక్రమ వలసదారుడు.. భార్య, కుమారుడి కళ్లెదుటే దారుణంగా అతడి తల నరికేశాడని వివరించారు. అలాంటి వ్యక్తి మన దేశంలో అస్సలు ఉండాల్సింది కాదని రాసుకొచ్చారు. 51 ఏళ్ల భారత సంతతి వ్యక్తి చంద్రమౌళి నాగమల్లయ్య డలాస్‌లోని మోటెల్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. 37 ఏళ్ల వయసు కల్గిన యొర్డానిస్ కోబోస్-మార్టినెజ్ అనే వ్యక్తి అక్కడే ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మోటెల్లోనే ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలోనే అక్కడే ఓ పాడుబడిన వాషింగ్ మిషన్ ఉండగా.. యొర్డానిస్ కోబోస్-మార్టినెజ్ అందులో బట్టలు ఉతుక్కున్నాడు. అయితే అది ఏమాత్రం సహించని చంద్రమౌళి నాగమల్లయ్య నేరుగా అతడి వద్దకే వెళ్లి నువ్వు చేసే పని నాకు నచ్చలేదని చెప్పడానికి బదులుగా.. అతడి తోటి మహిళా ఉద్యోగికి విషయం చెప్పాడు. దాన్ని వాడకూడదని చెప్పమని వివరించాడు. ఈక్రమంలోనే ఆమె వెళ్లి నిందితుడికి పాడుబడిన వాషింగ్ మిషన్ వాడొద్దని చెప్పింది. దీంతో నాగమల్లయ్యపై విపరీతమైన కోపం తెచ్చుకున్న అతడు నేరుగా వెళ్లి తన గదిలోంచి ఓ కత్తి తెచ్చుకున్నాడు. ఆపై నాగమల్లయ్య వద్దకు వెళ్లి గొడవ పడ్డాడు. కత్తితో పదే పదే దాడి చేశాడు. ముఖ్యంగా తల, మొండం వేరయ్యే వరకు కత్తితో నరుకుతూనే ఉన్నాడు. అయితే అతడు దాడి చేస్తున్నప్పుడు బాధితుడి భార్య, కుమారుడు కూడా అక్కడే ఉండి వద్దని వారించారు. అయినా వినకుండా నాగమల్లయ్యను చంపేసి.. ఆపై తలను బయటకు తీసుకెళ్లాడు. పార్కింగ్ స్థలంలో పడేసి కాళ్లతో తన్నుతూ.. ఆపై చెత్తబుట్టలో పడేసి పారిపోయాడు. అప్పటికే పోలీసులకు మోటల్ సిబ్బంది ఫిర్యాదు చేయగా.. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని వెంటాడి మరీ పట్టుకున్నారు.

# కింగ్ మేకర్‌గా కిషోర్ రాజకీయం

## అవతరించనున్న ప్రశాంత్ కిశోర్ మంత్రాంగం

**పాట్నా, సెప్టెంబర్ 16 :** ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) ఇప్పుడు బిహార్ రాజకీయాల్లో కీలక శక్తిగా మారబోతున్నారా? త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కింగ్‌మేకర్‌గా అవతరించనున్నారని తాజా ఒపీనియన్ పోల్ ఒకటి స్పష్టం చేసింది.

ఎన్నికల బరిలో ఉన్న ప్రధాన కూటముల మధ్య గట్టి పోటీ నెలకొన్న నేపథ్యంలో పీకే మద్దతు ఎవరికి దక్కితే వారే అధికార పీఠాన్ని చేజిక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆదివారం వెలువడిన సర్వే ఫలితాల ప్రకారం, ప్రశాంత్ కిశోర్ స్థాపించిన జన్ సురాజ్ పార్టీకి 8.3 శాతం ఓట్లు లభించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరికి మీ మద్దతు అని ప్రశ్నించగా, సర్వేలో పాల్గొన్న వారిలో 13.70 శాతం మంది పీకే వైపు మొగ్గు చూపడం గమనార్హం. ఇక, సీఎం రేసులో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ 33.5 శాతం మద్దతుతో అందరికంటే ముందున్నారు.

ప్రస్తుత ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు 24 శాతం మంది మద్దతు పలికారు. కూటముల విషయానికొస్తే, అధికార ఎన్డీయేకు 36.2 శాతం మంది మద్దతు తెలుపగా, ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన మహాకూటమికి 35.8 శాతం మంది ఓటు వేస్తామని చెప్పారు. ఈ రెండు కూటముల మధ్య కేవలం స్వల్ప ఓట్ల తేడా మాత్రమే ఉండటంతో పోరు రసవత్తరంగా మారనుంది.

# ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

**జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్**

**గ్రోమోర్ సెంటర్,ఆగ్రో రైతుసేవకేంద్రం తనిఖీ**



**చిట్యాల సెప్టెంబర్16(మన సమాజం)** ఎరువులను ఎమ్మార్పీ ధరకు మించి అమ్మితే డీలర్ల లైసెన్స్ రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి,మండల ప్రత్యేక అధికారి శ్రవణ్ కుమార్ అన్నారు. చిట్యాల పట్టణంలోని గ్రోమోర్ సెంటర్ ఆగ్రో రైతు సేవ కేంద్రం ను ఆకస్మికంగా తనిఖీ చేసి షాపులలో నిలువ ఉన్న ఎరువుల స్టాక్ ఈపాస్ మిషన్ లో స్టాక్ రిజిస్టర్ లో నమోదు చెక్ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎరువుల అమ్మకాల వివరాలను వెంటవెంటనే ఈపాస్ మిషన్ స్టాక్ రిజిస్టర్ లో నమోదు చేయాలని లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎరువుల దుకాణం లో లభ్యం అయ్యే ఎరువులను రోజువారిగా బోర్డుపై రాసి కనపడే విధంగా ప్రదర్శించవలెను తెలిపారు. మండల వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు మాట్లాడుతూ ఘన రూపంలో ఉన్న యూరియాకు బదులుగా అన్ని షాపులలో లభ్యమవుతున్న ద్రవ రూపంలో ఉన్న నానో యూరియా ఎకరాకు అరు లీటర్ చొప్పున స్ప్రే చేసుకోవాల్సిందిగా రైతులకు విజ్ఞప్తి చేయడం జరిగింది. తదనంతరం ఉరుమడ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న భోజన సదుపాయాలను తనిఖీ చేయడం జరిగింది విద్యార్థులకు అందజేసే భోజనం అన్ని రకాల పోషకాల తో సమతుల్య ఆహారాన్ని అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన జిల్లా యంత్రాంగం సహించేది ఉండదని తెలిపారు.

# ఎద్దు దాడిలో ఒకరి మృతి

**బెల్లంపల్లి సెప్టెంబర్ 16 (మన సమాజం)**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం లోని రవీంద్ర నగర్ లో మంగళవారం మధ్యాహ్నం ఎద్దు దాడి చేయడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. కాలానికి చెందిన జంగపల్లి రాజారాం (58) అనే వ్యక్తి ఇంటి సమీపం లో ఉండగా పక్కనుంచి వస్తున్న ఎద్దు ఒక్క సారిగా దాడి చేసింది. కొమ్ములతో దాడిచేసి ఒక్క సారిగా భీమయ్య ను కిందపడేసింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనలో రాజారాం కడుపులో ఎద్దు కొమ్ములు దిగి తీవ్రంగా రక్తస్రావమైంది. గాయపడ్డ రాజారాం ను స్థానికులు బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కి తరలిస్తుండగా మృతి చెందారు. మృతునికి భార్య లక్ష్మీ ముగురు కూతుళు ,,ఒక కొడుకు ఉన్నారు. తాళ్ళ గురిజాల ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ భూమిలో మొక్కలు నాటిన ఆర్డీవో అశోక్ రెడ్డి



**చిట్యాల సెప్టెంబర్16(మన సమాజం)** చిట్యాల మండలం సుంకనపల్లి గ్రామంలో ఇటీవల కాలంలో ఆక్రమణకు గురైన సర్వేనెంబర్ 20, 61 లో గల ప్రభుత్వ భూమిని నలగొండ ఆర్డీఓ అశోక్ రెడ్డి పరిశీలించారు అనంతరము ఉపాధి హామీ కూలీల సహకారంతో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు ఐదు రోజులలో మొక్కలు నాటి పూర్తి చేయవలసిందిగా ఉపాధి హామీ సిబ్బందికి ఆదేశించారు ప్రభుత్వ భూమినీ ఎవరైనా ఆక్రమించుకుంటే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కృష్ణా నాయక్, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

# కశ్మీర్‌లోకి దూసుకెళ్లిన తొలి గూడ్స్ రైలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:**
దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైన్యానికి అవసరమైన శీతాకాలపు సామాగ్రితో కూడిన తొలి గూడ్స్ రైలు కశ్మీర్ వరకు చేరింది. ఇది భారత రైల్వే చరిత్రలో ఒక కీలక ఘట్టంగా నిలిచింది. ఆర్మీకి అవసరమైన వస్తువులు మోసుకొచ్చిన ఈ కార్గో రైలు అనంతరం కశ్మీర్‌లో రైతులు పండిరచిన ఆపిల్స్ తోపాటు ఢిల్లీకి బయలుదేరింది. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే లింక్ అందుబాటులోకి రావడం వల్లే ఈ రవాణా సాధ్యమైందని భారత ఆర్మీ వెల్లడిరచింది. ఈ కార్గో రైలు మొత్తం 753 మెట్రిక్ టన్నుల శీతాకాలపు సామాగ్రితో అనంతనాగ్ వరకు చేరినట్లు తెలిపింది. ఈ ఘట్టాన్ని చారిత్రాత్మక మైలురాయిగా అభివర్ణించారు. హిమాలయాల కఠిన భౌగోళిక పరిస్థితుల్లో, ఆర్మీతో పాటు సాధారణ ప్రజలకు ఈ రవాణా మార్గం ఎంతో ఉపయోగకరమని ఆర్మీ పేర్కొంది. భారీ మంచు, కొండచరియలు విరిగిన కారణంగా రహదారులు మూసుకుపోయిన వేళ, ట్రక్కుల్లో నిలిచిపోయిన ఆపిల్స్ కుళ్లిపోతుండగా, ఈ రైలు సురక్షితంగా ఆపిల్స్‌ను గమ్యస్థానాలకు చేర్చిందని వివరించింది. ఈ రవాణా మార్గం ద్వారా ఆర్మీకి సరుకు సరఫరా వేగవంతం కావడంతో పాటు, కశ్మీర్ ప్రాంతానికి సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో కొత్త అవకాశాలు నెలకొంటాయని ఆర్మీ అభిప్రాయపడిరది.

# ఓజీకి ప్రీమియర్లు లేవా?

## పవన్ అభిమానులకు నిరాశ



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘ మరో వారం రోజుల్లో థియేటర్‌లలో సందడి చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు సుజిత్ దర్శకత్వం వహిస్తుండగా.. డీవీవీ బ్యానర్‌పై దానయ్య నిర్మిస్తున్నాడు. భారీ అంచనాల మీద వస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమాకు విడుదలకు ముందు ప్రీమియర్ షోలు ఉండవని తెలుస్తుంది. ఈ మేరకు వార్తలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. సాధారణంగా పెద్ద సినిమాలకు రిలీజ్‌కు ఒక రోజు ముందు ప్రీమియర్ షోలు ప్రదర్శించడం పరిపాటి. అయితే పుష్ప 2 ఘటన తర్వాత ఆ పరిస్థితి మొత్తం మారిపోయింది. ప్రభుత్వం కూడా ప్రీమియర్ షోలకు అనుమతి ఇవ్వకపోవడతో ఫ్యాన్స్ కూడా విడుదల రోజే సినిమాను చూస్తున్నారు. అయితే పవన్ కళ్యాణ్ సినిమాకు అయిన ప్రీమియర్స్ పడతాయి అనుకుంటే తెలంగాణలో అది జరిగేలా లేదని తెలుస్తుంది. ఈ సినిమా సెప్టెంబర్ 25న విడుదల కానుండగా.. ఉదయం 6 గంటల నుంచి షోలకి అనుమతి ఇవ్వబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ వార్తలపై చిత్రయూనిట్ స్పందించాల్సి ఉంది.

### ‘షో’ కోసం పరాయి మగాడితో

# బెడ్ పంచుకునేంత చీప్ కాదు..

**బిగ్ బాస్ షోపై తనుశ్రీ సంచలన వ్యాఖ్యలు**

బాలీవుడ్ నటి తనుశ్రీ దత్తా మరోసారి బీ టౌన్ వార్తల్లో నిలిచింది. ప్రముఖ రియాలిటీ షో బిగ్‌బాస్ షోలో పాల్గోనడానికి వచ్చిన రూ. 1.65 కోట్ల ఆఫర్‌ను తాను తిరస్కరించినట్లు తనుశ్రీ తెలిపింది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గోన్న ఆమె ఈ విషయం గురించి మాట్లాడింది. గత 11 ఏండ్లుగా ‘బిగ్ బాస్’ నిర్వాహకులు తనను షోలో పాల్గోనమని సంప్రదిస్తున్నారని తెలిపిన ఈ అమ్మడు. ఈ సీజన్ కోసం ఏకంగా రూ. 1.65 కోట్లు ఆఫర్ చేశారని వెల్లడించింది. అయితే నాతో పాటు మరో స్టార్ నటికి కూడా ఇంతే మొత్తంలో ఆఫర్ చేశారు. ఆ నటి షోలో పాల్గోంది. కానీ నాకు మాత్రం షోకి వెళ్లడానికి ఆసక్తి లేదని తనుశ్రీ చెప్పుకోచ్చింది. అంతేగాకుండా.. ఈ షోలో పాల్గొనకపోవడానికి మరో ముఖ్యమైన కారణం ఉందని తెలిపింది. ఈ షో కోసం ఒక పరాయి మగాడితో బెడ్ పంచుకునేంత చీప్ తాను కాదని ఘాటు వ్యాఖ్యలు చేసింది. హౌస్‌లో ఆడ, మగ కలిసి ఒకే గదిలో ఒకే బెడ్‌పై పడుకోవడం జరుగుతుందని అది తనకు ఇష్టం ఉండదని పేర్కొంది. నా వ్యక్తిగత స్వేచ్ఛ విషయంలో నా సొంత కుటుంబంతోనే నేను కలిసి ఉండను అలాంటిది పరాయి వ్యక్తులతో ఎలా ఒకే బెడ్‌పై పడుకోంటాను అంటూ చెప్పుకోచ్చింది. కెరీర్ విషయానికి వస్తే.. కొన్ని రోజులుగా సినిమాలకు దూరంగా ఉంటుంది ఈ అమ్మడు. బాలకృష్ణ సరసన నటించిన ‘వీరభద్ర’ (2006) ఆమె ఏకైక తెలుగు సినిమా. ఈ సినిమాలో ఆమె మాలతి అనే పాత్రలో నటించారు. ఈ సినిమాకు ఏ. ఎస్. రవికుమార్ చౌదరి దర్శకత్వం వహించారు.





# ‘కిష్కింధపురి’పై చిరంజీవి ప్రశంసలు..

## హారర్‌తో పాటు మంచి సందేశం ఉందన్న చిరు



యువ కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం ‘కిష్కింధపురి’ ఈ సినిమాకు కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించగా.. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించింది. హారర్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రం సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. అయితే తాజాగా ఈ సినిమాను చూసిన అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి సినిమాపై ప్రశంసలు కురిపించాడు. మన శంకర వరప్రసాద్ గారు చిత్ర నిర్మాత సాహు గారపాటి నిర్మాణంలో వచ్చిన మరో చిత్రం కిష్కింధపురి. ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా చూసిన నాకు చిత్రయూనిట్ అంతా కలిసి మంచి ప్రయత్నం చేశారు అనిపించింది. ఈ చిత్రం ఇంతటి విజయం సాధించినందుకు చిత్రబృందానికి నా శుభాకాంక్షలు. సాధారణంగా హారర్ సినిమాలంటే భయంని ఎలివెట్ చేస్తూ.. దెయ్యం కథ చెప్పడం జరుగుతుంది. కానీ కిష్కింధపురిలో హారర్‌తో పాటు మంచి సైకాలాజికల్ పాయింట్‌ని జత చేసి చెప్పడం చాలా బాగుంది. శారీకర వైకల్యం కంటే మానసిక వైకల్యం చాలా ప్రమాదకరమని మేకర్స్ చక్కని సందేశం ఇచ్చారు. ఈ సినిమాను ఇంత బాగా తెరకెక్కించిన దర్శకుడు కౌశిక్‌ని అభినందిచక తప్పదు. ఈ చిత్రం ద్వారా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే అనుపమ కూడా మంచి విజయాన్ని అందుకుంది. సంగీత దర్శకుడు చైతన్య మంచి పనితనం చూపించాడు. మొత్తంగా ప్రేక్షకులకు మంచి సినిమాను అందించిన నిర్మాత సాహు గారపాటికి కృతజ్ఞతలు.. ప్రస్తుతం థియేటర్‌లో ఆడుతున్న ఈ సినిమాను మీరు మిస్ అవ్వకండంటూ చిరు చెప్పుకోచ్చాడు.

# మోడల్‌తో హార్దిక్ పాండ్యా సీక్రెట్ డేటింగ్

## నెట్టింట ఫొటోలు వైరల్

స్టార్ క్రికెటర్, టీమ్ ఇండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాడు. గతేడాది తన భార్య నటాషాతో విడాకులు ప్రకటించిన అనంతరం పాండ్య బ్రిటీష్ సింగర్ జాస్మిన్ వాలియాతో కొన్నిరోజులు డేటింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. అయితే ఇది కూడా కొన్నిరోజులకే బ్రేకప్ అవ్వగా.. తాజాగా పాండ్య మరో అమ్మాయితో డేటింగ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. ఈసారి పాండ్య మోడల్, నటి మహియెకా శర్మతో డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వైరలవుతున్నాయి. మొదటగా ఈ పుకార్లు రెడిట్ అనే సోషల్ మీడియా ద్వారా ప్రారంభం అయ్యాయి. ఇందులో ఒక పోస్ట్‌లో మహియెకా షేర్ చేసిన ఒక సెల్ఫీ బ్యాక్‌గ్రౌండ్‌లో ఒక వ్యక్తి బ్లర్‌గా కనిపించాడు. అయితే అతడు హార్దిక్ పాండ్యానే అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అంతేగాకుండా మహియెకా పోస్ట్‌లలో ఎక్కడో హార్దిక్ జెర్సీ నంబర్ 33 కనిపించడాన్ని కూడా ఒక యూజర్ గుర్తించారు. మరోవైపు ఈ వార్తలకు మరింత బలం చేకూరుస్తూ.. హార్దిక్, మహియెకా ఇద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు ఫాలో అవుతున్నారని అభిమానులు గమనించారు. కొన్ని ఫోటోలలో ఇద్దరూ ఒకే రకమైన బాత్‌రోబ్ ధరించినట్లు కూడా గుర్తించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను కూడా నెటిజన్లు సోషల్ మీడియాలో బయటపెట్టారు. ఆసియా కప్ కోసం హార్దిక్ దుబాయ్‌లో ఉన్న సమయంలో మహియెకా కూడా అక్కడికి వెళ్లినట్లు వార్తలు రావడంతో ఈ పుకార్లు మరింత పెరిగాయి. అయితే ఈ విషయంలో క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు.